క్లుప్తంగా

శ్రావణమాసం యజ్ఞం



యజ్ఞం నిర్వహిస్తున్న ఆర్యసమాజ్ ప్రతినిధులు

జహీరాబాద్ టౌన్: ఆర్యసమాజ్ సమాజ్ ఆధ్వర్యంలో పట్టణంలోని మాణిక్‌ప్రభు వీధిలోని దత్తాత్రి నివాసంలో మంగళవారం శ్రావణ మాసం యజ్ఞం నిర్వహించారు. ప్రతి సంవత్సరం శ్రావణమాసం మొత్తం యజ్ఞాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా వేదాల ప్రకారం యజ్ఞం నిర్వహించి ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఆర్యసమాజ్ ప్రతినిధులు రాంచందర్, ఈశ్వర్, సుధీర్‌బండారీ, కృష్ణయ్య, చంద్రశేఖర్, గాలయ్య, బరూర్ దత్తాత్రి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎరువుల పంపిణీ



ఎరువులు పంపిణీ చేస్తున్న అధికారులు

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్‌లో ఎరువుల పంపిణీ కొనసాగుతోంది. పీఏసీఎస్‌కు 400 బస్తాలు, డీసీఎంఎస్‌కు 560 యూరియా బస్తాలు వచ్చాయి. వాటిని జహీరాబాద్ వ్యవసాయ సహాయ సంచాలకులు భిక్షపతి, మండల వ్యవసాయ శాఖ అధికారి అభినాష్ వర్మ మంగళవారం రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల అవసరం మేరకు ఎరువులను తెప్పిస్తున్నామన్నారు. ఎరువుల కొరత లేదన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు పడకంటి వెంకట్‌తో పాటు రైతులు నాగన్న, కిష్టన్న పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్

సదాశివపేట(సంగారెడ్డి): సీఎం సహాయనిధి పేదలకు వరమని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహంలో 33 మంది లబ్ధిదారులకు రూ.8, 70000 లక్షల విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి వీరేశం, మాజీ కౌన్సిలర్లు కలీం, మొబిన్, శివకుమార్, ఖాజా మైనార్టీ పట్టణ అధ్యక్షులు కామిల్ పాల్గొన్నారు.

జన్మాష్టమి వేడుకలకు ఏర్పాట్లు



ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న కార్పొరేటర్

పటాన్‌చెరు టౌన్: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కార్పొరేటర్ మెట్టు కుమార్ తెలిపారు. మంగళవారం డివిజన్ పరిధిలోని జేపీకాలనీలోని రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ పరిసర ప్రాంతాల్లో పర్యటించి, అక్కడ చేయాల్సిన పారిశుద్ధ్య పనులను కార్మికులకు వివరించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. 16న శ్రీకృష్ణ జన్మాష్టమి నేపథ్యంలో దేవస్థానానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్



స్పెషల్ డ్రైవ్‌ను పర్యవేక్షిస్తున్న జగ్జీవన్

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలో 100 రోజుల ప్రణాళికలో భాగంగా మంగళవారం పారిశుద్ధ్య స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పలు కాలనీల్లోని కాల్వల్లో పేరుకుపోయిన మురుగును తొలగించారు. అంతర్గత రహదారులు, ముళ్లపొదలు, పిచ్చిమొక్కలను తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. తడి, పొడి చెత్తపై కాలనీవాసులకు అవగాహన కల్పించారు. కమిషనర్ జగ్జీవన్, శానిటరీ అధికారి శ్రీనివాస్, వార్డు అధికారులు పనులను పర్యవేక్షించారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. సోమవారం నిర్వహించిన తనిఖీల్లో 11 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపరచగా ఎనిమిది మందికి ఒక్కొక్కరికి రూ. వెయ్యి, మరో ముగ్గురికి రూ.1,500 చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

అవసరం ఒక చోట.. నిర్మాణం మరో చోట



వరద ప్రవహించని ప్రదేశంలో నిర్మించిన బ్రిడ్జి

బ్రిడ్జి నిర్మాణానికి రూ. 80 లక్షల ప్రజాధనం వృథా

- పక్కనే శిథిలావస్థకు చేరిన మరో బ్రిడ్జి
- అధికారుల తీరుపై విమర్శలు

జహీరాబాద్: జహీరాబాద్ నుంచి అల్గోల్, బీదర్ వెళ్లేందుకు నిర్మించిన బైపాస్ రహదారిపై ఉన్న పురాతన శిథిలమైన బ్రిడ్జి స్థానంలో కొత్తగా నిర్మించకపోగా, పక్కనే ఉన్న చిన్న కాలువపై బ్రిడ్జిని నిర్మించి అధికారులు తమ అజ్ఞానాన్ని చాటుకున్నారు. పెద్ద వర్షం కురిస్తే ఈ రహదారిపై ఉన్న శిథిల బ్రిడ్జి మీద నుంచి వరద ప్రవహిస్తుంది. ఈ బ్రిడ్జి స్థానంలో కొత్త బ్రిడ్జిని నిర్మించాల్సి ఉండగా అందుకు భిన్నంగా ఏ మాత్రం వరద రాని ప్రాంతంలో బ్రిడ్జిని నిర్మించి ఆర్‌అండ్‌బీ అధికారులు ఔరా అనిపించుకున్నారు. ప్రస్తుతం నిర్మించిన బ్రిడ్జి నుంచి ఇప్పటివరకు చుక్క వర్షం నీరు కూడా పారలేదు. భారీ వర్షం కురిసినా బ్రిడ్జి కింద నుంచి నీరు ప్రవహించే అవకాశం కూడా లేదు. దీంతో నిర్మాణం కోసం వెచ్చించిన నిధులన్నీ వృథా అయ్యాయి. ఇక్కడ బ్రిడ్జిని ఎందుకు ప్రతిపాదించారో? అవసరం ఉన్న చోట ఎందుకు ప్రతిపాదించలేక పోయారో అనే విషయం ఎవరికీ అర్థం కావడం లేదు. అధికారులు చేసిన తప్పిదాల మూలంగానే ఇలాంటి పరిణామాలు చోటు చేసుకుంటున్నాని స్పష్టం అవుతోంది. అధికారుల అవినీతి, కాంట్రాక్టర్ల అక్రమాలకు ఈ బ్రిడ్జి నిదర్శనంగా నిలుస్తోందని స్థానిక ప్రజలు, వాహనచోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రూ.80 లక్షలతో బ్రిడ్జి నిర్మాణం

కొత్తగా నిర్మిస్తున్న బ్రిడ్జి కోసం 2021–22 సంవత్సరంలో రూ.80 లక్షలతో ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రతిపాదించారు. 2022 సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యాయి. 2023 సంవత్సరంలో పనులను ప్రారంభించారు. 2023 డిసెంబర్‌లో కాంట్రాక్టర్ పనులను అర్ధాంతరంగా నిలిపేశారు. ఇప్పటివరకు రూ.35 లక్షల విలువ గల పనులు పూర్తయ్యాయి. పనులు ఆగిపోవడంతో రోడ్డంతా బురదమయంగా మారి వాహనచోదకులు రాకపోకలు సాగించలేకపోతున్నారు.

పక్కనే శిథిలావస్థలో బ్రిడ్జి

ప్రస్తుతం నిర్మించిన బ్రిడ్జికి కేవలం 200 మీటర్ల దూరంలోనే దశాబ్దాల క్రితం కట్టిన పాత బ్రిడ్జి శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. శిథిలమైన బ్రిడ్జి ప్రదేశంలోనే కొత్త బ్రిడ్జి నిర్మించి ఉంటే ప్రయాణానికి ఎంతో సౌకర్యంగా ఉండేది. ప్రస్తుతం నిర్మించిన బ్రిడ్జి వద్ద కొత్తగా బ్రిడ్జి నిర్మించకుండా ఇరువైపులా కాలువలను నిర్మించి ఉంటే అక్కడి వరద నీరంతా శిథిలమైన బ్రిడ్జి ఉన్న వాగులోకి వచ్చి చేరేది. ప్రస్తుతం బ్రిడ్జిని నిర్మించిన ప్రదేశంలో నీరు ప్రవహించే ఎలాంటి వరద కాలువ కూడా లేదు. దీంతో కొత్తగా నిర్మించిన బ్రిడ్జి వద్ద వర్షం నీటిని తరలించాలన్నా రోడ్డుకు ఇరు వైపుల నుంచి కాలువ నిర్మాణం చేసి శిథిలమైన బ్రిడ్జి ఉన్న వాగులోకే నీటిని మళ్లించాల్సిన ఉంది. దీంతో కొత్తగా నిర్మించిన బ్రిడ్జి వల్ల ఎలాంటి ఉపయోగం లేకుండా ఉందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. కొత్త నిర్మాణాన్ని ఉత్సవ బ్రిడ్జిగా మాత్రమే చూడాల్సి వస్తోంది.



బ్రిడ్జి నిర్మాణం చేయాల్సిన అల్గోల్ వాగు ప్రదేశం

అప్పటి పరిస్థితిని బట్టి ప్రతిపాదించాం

అప్పటి పరిస్థితిని బట్టి బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదించాం. అధిక వర్షం కురిస్తే వరద నీటితో రహదారిపై రాకపోకలు సాగించేందుకు వీలులేని పరిస్థితి. అప్పట్లో పైపుల కల్వర్టు కూడా ఉంది. దీంతో బ్రిడ్జి నిర్మాణం పనులు చేపట్టాం. ప్రస్తుతం వెంచర్లు రావడంతో నీరు రావడం లేదు. పెద్ద వర్షం కురిస్తే వరద వచ్చే అవకాశం ఉంది. వారం రోజుల్లో పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నాం.

–సంధ్య, ఆర్‌అండ్‌బీ ఏఈఈ–జహీరాబాద్



బోనాల ఊరేగింపులో అధ్యాపకులు, విద్యార్థినులు

భక్తిశ్రద్ధలతో శ్రావణమాస బోనాలు

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం శ్రావణమాస బోనాల ఊరేగింపు నిర్వహించారు. కళాశాల నుంచి ఎల్లమ్మ మందిరం వరకు సిబ్బంది విద్యార్థినులు బోనాల ఊరేగింపుగా తరలి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ భారతి మాట్లాడుతూ.. శ్రావణమాసం సందర్భంగా అమ్మవారికి బోనం సమర్పించడం చాలా సంతోషంగా ఉందన్నారు. బోనం సమర్పించిన వెంటనే వర్షం కురువడం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సిద్దులు, శకుంతల, మురళీకృష్ణ, సర్వయ్య, సావిద్య, మంజుల, రాజిరెడ్డి, రాధా, రేఖ, నవ్యలతో పాటు విద్యార్థినులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారం అందించాలి

జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి సౌజన్య

సంగారెడ్డి టౌన్: హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి సౌజన్య అన్నారు. బుధవారం సంగారెడ్డిలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలురుల రెసిడెన్షియల్ పాఠశాలను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ.. విద్యార్థులకు అందించే ఆహారంపై జాగ్రత్త వహించాలన్నారు. విద్యార్థులకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆహారాన్ని పరిశీలిస్తున్న సౌజన్య

సునీతారెడ్డిని విమర్శిస్తే ఖబడ్దార్

బీఆర్‌ఎస్ నాయకుడు రామచంద్రారెడ్డి

హత్నూర(సంగారెడ్డి): కాంగ్రెస్ నాయకులు స్థాయిని మరిచి ఎమ్మెల్యే సునీతారెడ్డిని విమర్శిస్తే ఖబర్దార్ అంటూ బీఆర్‌ఎస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి హెచ్చరించారు. మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల అధికార కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి పాల్గొని చెక్కులు, రేషన్ కార్డులు పంపిణీ చేస్తే కాంగ్రెస్ నాయకులు సమావేశాన్ని అడ్డుకోవడం సిగ్గుచేటు అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే గ్రామాల అభివృద్ధి చెందాయని తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యమని దుయ్యబట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి ఫొటోలు అధికార కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తీసుకోవచ్చు.. క్షీరాభిషేకం చేస్తామంటూ చిల్లర చేష్టలు చేశారని మండిపడ్డారు. సమావేశంలో మాజీ ఎంపీపీ నర్సింలు, నాయకులు శ్రీకాంత్, కిషోర్, కృష్ణ, వీరేందర్, ఇబ్రహీం, శేఖర్‌గౌడ్, నర్సింలు, యాదగిరి, రమేష్, అంజయ్య పలు గ్రామాల బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.



మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

నాట్య మయూరి కనువిందు

నారాయణఖేడ్: సాయం సంధ్య వేళ ఓ నెమలి తన తోడు సంబురం కోసం పురివిప్పి నాట్యమాడి చుపరులను కట్టిపడేసింది. పట్టణ శివారులోని డీఎస్పీ కార్యాలయ సమీపంలో నిజాంపేట – ఖేడ్– బీదర్ 161బీ జాతీయరహదారి పక్కన మంగళవారం సాయంత్రం ఓ నెమలి పురివిప్పి నాట్యం చేస్తూ చూపరులను కనువిందు చేసింది. ఆకాశం మేఘావృతమై ఉండగా అక్కడకు పలు నెమళ్లు వచ్చాయి. వాటిలో ఓ నెమలి పురివిప్పి కొంతసేపు నాట్యం చేసింది. రహదారిగుండా రాకపోకలు సాగించే వాహనదారులు ఆసక్తిగా తిలకించారు.



పురివిప్పి నాట్యం చేస్తున్న నెమలి

ఎస్‌జీటీల సమస్యల పరిష్కారానికి కృషి

యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టయ్య

జహీరాబాద్ టౌన్: ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల(ఎస్‌జీటీ)సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని, టీచర్లు సంఘానికి సహకరించాలని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల కిష్టయ్య అన్నారు. నియోజకవర్గంలో ఎస్‌జీటీ యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు లేదన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్‌జీటీలకు ఓటు హక్కు కల్పించాలని, కామన్ సీనియార్టీ ప్రకారం ప్రమోషన్లు కల్పించాలన్నారు. పీఆర్సీ త్వరగా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు యూసూఫ్, కార్యదర్శి శివకుమార్ నాయకులు వెంకటేశం, దయాకర్, యాదుల్ల, ప్రసాద్ పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు చేయిస్తున్న కిష్టయ్య

స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు

పటాన్‌చెరు టౌన్: పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు పాలిటెక్నిక్ కోర్సుల కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైనట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మంగళవారం నుంచి గురువారం 7వరకు దరఖాస్తుల స్వీకరణ, 8న స్పాట్ అడ్మిషన్ ఉంటుందన్నారు. పాలిటెక్నిక్‌లో ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్స్, ఎలక్ట్రికల్ కోర్సులు ఉన్నాయని చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం కళాశాలలో సంప్రదించాలన్నారు.

పెసర పంట పరిశీలన

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్ గ్రామశివారులో రైతులు సాగు చేసిన పెసర, కంది పంటలను మంగళవారం జహీరాబాద్ వ్యవసాయ సహాయ సంచాలకులు భిక్షపతి, మండల వ్యవసాయశాఖ అధికారి అభినాష్ వర్మ పరిశీలించారు. నాణ్యమైన విత్తన పథకంలో భాగంగా గత జూన్ మాసంలో రైతులకు డబ్ల్యూఆర్‌జీఈ 97 రకం కంది, ఎంజీజీ 295 రకం పెసర విత్తనాలను అధికారులు రైతులకు ఉచితంగా అందజేశారు. రైతులు సాగు చేసుకున్న పెసర, కంది పంటలు అధికారులు పరిశీలించారు. రైతులు సాగు చేసుకున్న పంటలు ప్రస్తుతం ఆశాజనకంగా ఉన్నాయని ఏడీఏ భిక్షపతి అన్నారు. అనంతరం రైతు వేదికల్లో నిర్వహించిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు

పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ

సదాశివపేట(సంగారెడ్డి): అర్హులందరికీ ప్రభుత్వం దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని 23వ వార్డులోని లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను అందజేసి ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. గూడులేని పేదలకు సొంతింటి కలను నిజం చేయడానికే కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని అడ్డంకులు సృష్టించిన ప్రభుత్వ అరు గ్యారంటీలను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో 23వ వార్డు ఇంచార్జీ శరత్‌చంద్ర, మాజీ కౌన్సిలర్లు నాగరాజ్‌గౌడ్, శంకర్‌గౌడ్, గుండు రవి, కాంగ్రెస్ నాయకులు శివ, మతిన్, అహ్మద్, వార్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఐడియా బాక్సులతో ప్రయోజనం

సదాశివపేట(సంగారెడ్డి): భవిష్యత్తులో మంచి శాస్త్రవేత్తలుగా ఎదగడానికి ఐడియా బాక్స్‌లు విద్యార్థులకు ఉపయోగపడతాయని ఎంఈఓ శంకర్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని జీనియస్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఎంఈఓ శంకర్ ఐడియా బాక్స్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులందరూ సృజనాత్మకంగా ఆలోచించాలన్నారు. పట్టణంలో మొదటిసారిగా ఐడియా బాక్స్‌ను ఆవిష్కరించిన జీనియస్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ యాజమాన్యం, ఉపాధ్యాయ బృందాన్ని ఎంఈఓ శంకర్ అభినందించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ రఘువర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రీతి, సీఆర్‌పీలు రాజేశ్వర్, మల్లేశం, అక్బర్ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



ఐడియా బాక్స్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ శంకర్

నారాయణఖేడ్‌లో భారీ వర్షం



రోడ్డుపై ప్రవహిస్తున్న వరదనీరు

నారాయణఖేడ్: ఖేడ్‌లో వరుసగా రెండవ రోజూ మంగళవారం సాయంత్రం గంట పాటు ఏకధాటిగా భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. చెరువులు, కుంటల్లోకి నీరు చేరింది. పంటపొలాల్లో నీరు నిలిచింది. పట్టణంలోని ప్రధాన, జాతీయ రహదారిపై మూడు అడుగుల మేర వరదనీరు పారింది. ప్రధాన కూడళ్లు జలమయమయ్యాయి. లోతట్టు కాలనీలోని పలు ఇళ్లలోకి వరదనీరు చేరింది.

సీపీఎస్ విధానం రద్దు చేయాలి

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ, ఉద్యోగులకు శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం పట్టణంలోని కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకుడు లక్ష్మారెడ్డి, అశోక్ కుమార్ మాట్లాడుతూ.. యూపీఎస్‌సీ ఆధ్వర్యంలో తీసుకున్న మూడు దశల పోరాటంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్‌ల వద్ద ధర్నా నిర్వహించారు. ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలు వెంటనే పరిష్కారం చేయడంతో పాటు పీఆర్సీ నివేదికను బహిర్గత పరిచి సంఘాలతో చర్చించి ఆమోదయోగ్యమైన పిఆర్సీ అమలు చేయాలని కోరారు. పెండింగ్ లో ఉన్న వివిధ రకాల బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి నెల రూ.700 కోట్లు విడుదల చేసి బిల్లుల అడ్జస్ట్ చేయాలన్నారు. కార్యక్రమంలో యుఎస్‌పీసీ నాయకులు కొండయ్య,లక్ష్మయ్య యాదవ్, అశోక్, సోమశేఖర్, సాయిలు, రామచందర్, శ్రీనివాసరావు, సువర్ణ, కాశీనాథ్, నాజర్ పటేల్, రాములు, శామయ్య, అరుణశ్రీ, అమరేశ్వరి, వైశాలి, జనార్దన్‌రెడ్డి, అనురాధ, నాగేశ్వరరావు, సాయితేజ, చందర్ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వ్యర్థజలాల విడుదలపై ఆగ్రహం

జిన్నారం(పటాన్‌చెరు): వర్షం కురిస్తే పరిశ్రమలకు పండగేనని మరోసారి రుజువైంది. సోమవారం కురిసిన భారీ వర్షానికి బొల్లారం, గడ్డపోతారం, ఖాజిపల్లి, బొంతపల్లి, గుమ్మడిదల పారిశ్రామికవాడలోని పలు పరిశ్రమలు భారీగా రసాయన వ్యర్థజలాలను వరదనీటితో చెరువులు, కుంటల్లోకి వదిలారు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. నల్లటి, పసుపుపచ్చ, ఎర్రటి రంగుతో పారిశ్రామికవాడలోని మురికినీటి కాలువలు దర్శనమిచ్చాయి. ప్రజలు, పీసీబీ అధికారుల కళ్లు గప్పి రాత్రిసమయాల్లో బహిరంగ ప్రదేశాల్లోకి విడుదల చేశారు. గడ్డపోతారం పరిధిలోని ఎంఎస్ఎన్ పరిశ్రమ దొడ్డిదారిన పెద్ద కాలువను నిర్మించి వ్యర్థాలను విడుదల చేస్తుండడాన్ని గుర్తించిన స్థానికులు ఆ కాలువను ఇటీవల పూడ్చేశారు. వ్యర్థజలాల విడుదలపై గ్రామస్తులు మంగళవారం మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్యకు ఫిర్యాదు చేశారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధికి కృషి



డ్రైన్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పరిధిలోని అన్ని కాలనీల్లో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరణకు కృషి చేస్తున్నామని కార్పొరేటర్ పుష్ప అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని రామచంద్రారెడ్డి నగర్ కాలనీలో ఓపెన్ డ్రైన్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. చిన్నపాటి వర్షానికి కాలనీలో పెద్ద ఎత్తున రోడ్లపై వర్షం నీళ్లు నిలుస్తున్నాయని అన్నారు. గతంలో జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ఆయన స్పందించి రూ.23 లక్షల నిధులను మంజూరు చేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు శశికళ, జగన్నాథ్‌రెడ్డి, చంద్రశేఖర్ గుప్తా, తిరుమల్ గౌడ్, యాదయ్య, వీరారెడ్డి, భుజంగారెడ్డి పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 7న స్పాట్ అడ్మిషన్ ఉంటుందని కళాశాల ప్రిన్సిపాల్ జానకి ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ కోర్సులలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం స్పాట్ అడ్మిషన్లు ఉన్నాయని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన ఆసక్తి కలిగిన అభ్యర్థులు సర్టిఫికేట్లతో కళాశాలలో సంప్రదించాలన్నారు.